# వింత మనిషి

అంతా ఆ ఏడుకొండలవాడి దయ అంటూ శేషయ్య హాలులో వున్న వటంవేపు తిరిగి దండంపెట్టుకున్నాడు.

ఇప్పుడతనికి పగవాడిక్కూడా రాకూడదనంతటి కష్టం వచ్చింది. అందుకే దండంపెట్టుకున్నాడు.

శేషయ్య అంటే మామూలు మనిషికాడు. వేరుసెనగమిల్లు బట్టల వ్యాపారం, చిట్‌ఫండు, చింతపండు, జీడిపప్పు, మిరియాలు, టర్కీకోళ్లు, కప్పకాళ్ళు-యిలాంటి వ్యాపారాలెన్నో తనకున్న ఒక్క తలకాయతోనూ రెండుచేతులతోనూ చేసి తన అమూల్యమైన జీవిత కాలంలో ప్రతినిమిషాన్నీ ఒకరూపాయికింద మార్చి ఓపదిలక్షల ఆస్తి చేసిన అభినవ కుబేరుడు. అతనికి కోడిని చూసినా, గోడని చూసినా, మనిషినిచూసినా, మానునిచూసినా, గుడినిచూసినా, గుళ్ళోదేవుణ్ణి చూసినా, ఏదిచూసినా దానిని రూపాయలుగా మార్చడమెలాగో చప్పున స్ఫురిస్తుంది. స్ఫురించిన తరువాత ఆలోచిస్తూ కూర్చోడు. ఆలోచిస్తూ కూర్చోవడం కార్యవాదుల లక్షణంకాదు. కాబట్టి వెంటనే కార్యరంగంలోకి దూకి దాని అంతు తేల్చి బయటికొస్తాడు. సిగ్గూ లజ్జా దయా దాక్షిణ్యం మానమర్యాదలు యిలాంటివేవీ యీ కార్యదీక్షకు అడ్డురావు.

శేషయ్యకు ఊళ్ళో పరువుప్రతిష్టలు దండిగావున్నాయి. అబద్ధాలాడినా, కడుపులు మాడ్చినా, కొంపలు కూల్చినా, ద్రోహంచేసినా, దగాచేసినా అతని పరువూ ప్రతిష్టా ఐశ్వర్యంతోబాటు దినదిన ప్రవర్ధమానమైంది.

శేషయ్య తన లక్ష్యసాధనకై ఎంత వాడినైనా డబ్బిచ్చి కొనేయగలడు దెబ్బకొట్టి కిందపడేయగలడు. సామదాన భేద దండ చతురో

పాయాలన్నీ ప్రయోగించి లొంగదీసుకోగలడు. అతని అధికారానికి పలుకుబడికీ మరి తిరుగులేదు.

అలాంటి శేషయ్య యివాళ హాలులో నిల్చుని దేవుడికి దండం పెట్టుకున్నాడు. పాపం పెద్ద కష్టమొచ్చింది మరి!

పేదవాళ్ళకేగాని మిలియనీర్లకే కష్టాలురావని ఎవరైనా అనుకుంటె అది చాలా పొరపాటు. ఆ మాటకొస్తే పేదవాళ్ళ బతుకులే హాయి అని శేషయ్య సిద్ధాంతం. అందుకే కూలి డబ్బులు చాలవని కూలీలు అడిగితే శేషయ్య అంటూ ఉంటాడు. మీకేమిటిరా మహారాజులు కూలీ డబ్బులు పట్టుకెళ్ళి కల్లోగంజో తాగి జర్రున త్రేన్చి గురుపెట్టినిద్ర పోతారు. నాబాధలు మీకేంతెలుసురా. ప్రతి లంజకొడుకూ దగా చేసేవాడే. ప్రతి తలకుమాసిన వెధవా అధికారం చెలాయించి తాల్చుకుతినేవాడే. నాదగ్గర కొచ్చేవాడెవ్వడూ నన్నుద్ధరించడానికి రాడుకదా. కాళ్ళలో కాలుపెట్టి కిందపడేయడానికేవొస్తాడు. వీళ్ళందరి తోనూ వేగలేక చస్తున్నాను. రాత్రిళ్ళు కంటికి కునుకుపట్టదంటే నమ్మండి. అయినా మీరు నమ్మరు, నాకు తెలుసు.

పేదవాళ్ళకి కష్టాలొస్తాయని ఒప్పుకున్నా వాళ్ళలా దేవుడుమీద భారంవేసి వూరుకోడు శేషయ్య. తనకు చేతనయిన సకలప్రయత్నాలు చేసి అలాంటి కష్టాల్ని నష్టాల్ని నేర్పుగా ప్రక్కకి నెట్టేస్తూ వుంటాడు. ఎప్పుడైనా ప్రయత్నాలన్నీ విఫలమైతే అప్పుడే దేవుడిసాయం కోరుతాడు.

ఇప్పుడు శేషయ్య కొచ్చిన కష్టాన్ని తొలగించడానికి చేసే ప్రయత్నాలన్నీ యింకా పూర్తిగా విఫలంకాకపోయినా ఫెయిలయే సూచనలు బయటపడటంతో దేవుడికి దండంపెట్టుకున్నాడు.

ఇంతకీ శేషయ్యకొచ్చిన కష్టమేమిటో చెప్పకుండా కప్పదాడేస్తున్నాను.

శేషయ్య మేనల్లుడు వెంకటప్పయ్యవచ్చి ఒకదుర్వార్తచెప్పేడు. కొత్తగా ట్రాన్స్ఫరయి వచ్చిన ఇన్కమ్టాక్సుఆఫీసరు మూర్తి సన్మానానికి ఒప్పుకోలేదని చెప్పేడు.

మేనల్లుడు వెంకటప్పయ్య చాల గట్టివాడు. బహుకార్థ సాధక యోజన వంటివాడు. శేషయ్యకు మేనల్లుడు, మేనేజరు, శిష్యుడు, సెక్రటరీ కాబోయే అల్లుడు. శేషయ్యవద్ద బాగా ట్రెయినింగు పొందిన వాడు. అత్యంత ముఖ్యమైన పనులు చక్కబెట్టుకు రావడానికి వెంకటప్పయ్యను పంపుతూ వుంటాడు శేషయ్య. అతనికి సాధారణంగా అపజయమనేది వుండదు. కాని ఈసారి ఫెయిలయ్యాడు.

లక్ష రూపాయలు ఇన్కమ్టాక్సు బాకీ కట్టలేదనే కేసు శేషయ్య మీద ఆరు మాసాలయి నడుస్తూంది. దానిని తేలగొట్టడానికి చేయవలసిన ప్రయత్నాలన్నీ చేశాడు శేషయ్య. ఆ ప్రయత్నాలు ఫలించబోయే సమయానికి పాత ఇన్కమ్టాక్సు ఆఫీసరు బదిలీ అయిపోయి మూర్తి అనే కొత్త ఆఫీసరొచ్చాడు.

"ఈ ఆఫీసరొక చిత్రమైనవాడు మామయ్యా. కుర్రవాడయినా ఏ సరదాలూ లేవు. సిగిరెట్టు కాల్చడు. కాఫీ తాగడు. సినిమాకెళ్ళడు క్లబ్బుకెళ్ళడు, ఎప్పుడూ పుస్తకం పట్టుకుని కూర్చుంటాడు" అన్నాడు వెంకటప్పయ్య.

"డబ్బాశ చూపించావా? అనడిగాడు శేషయ్య.

"ఆ సంగతి నన్నడగాలా మామయ్యా, ఇప్పటికో వందమంది ఆఫీసర్లని చూసుంటాను మన పురాణాల్లో చెబుతూవుంటారు చూడు

యుద్ధాల్లో ఆ అస్త్రం యీ అస్త్రం వేశారని నేను అలాగే అన్ని రకాల అస్త్రాలు ప్రయోగించాను. సన్మానం ఘనంగా ఏర్పాటు చేస్తున్నామన్నాను, రానన్నాడు. ఆఫీసుకి రిక్షా మీద వెళ్ళడమేమిటి కారిస్తాం వాడుకోమన్నాను. వద్దన్నాడు. ఊ అంటే కొన్ని వేల రూపాయలు కాళ్ళదగ్గరకొచ్చి పడతాయన్నాను. అలాంటి ప్రయత్నమేమయినా చేస్తే పోలీసులకి కబురు పెడతానన్నాడు. చివరికి బ్రహ్మాస్త్రం ప్రయోగించాను. మన రాధమ్మను తీసుకెళ్ళి పరిచయం చేశాను. కానీ అదీ పని చెయ్యలేదు అన్నాడు వెంకటప్పయ్య.

"వీడెవడో పిచ్చాడులా వున్నాడు" అని ఒక్క ముక్కలో వ్యాఖ్యానించాడు శేషయ్య.

అంతవరకు ఒక హాలులో ఒక మూల కూర్చుని డిటెక్టివ్ నవల చదువుతూ ఒక చెవితో యీ సంభాషణంతా వింటూన్న శేషయ్యగారి ఏకైక పుత్రిక రాధ చటుక్కున లేచి "అవును డాడీ క్రాక్, పెద్ద క్రాక్, నో డవుట్" అంది. వెంకటప్పయ్య నన్ను ఇంట్రడ్యూస్ చేశాడు. పిక్చరుకెల్దాం వదండన్నాను. రానన్నాడు. అయితే నన్ను ఒంటరిగా సినిమాకెళ్ళమంటారా అన్నాను. అంటే ఏమన్నాడో తెలుసా డాడీ. నీకంత భయమయితే మా ప్యూన్‌ని సాయం పంపుతాను. తీసుకెళ్ళమన్నాడు. స్టుపిడ్ ఇలా నన్నింతవరకు ఎవరు ఇన్సల్టు చెయ్యలేదు డాడీ" అంటూ పేథటిక్‌గా కళ్ళనీళ్ళు తుడుచుకుంది అల్ట్రా మోడరన్ రాధాదేవి.

మనిషన్నవాడు డబ్బుకి లొంగలేదంటే శేషయ్య షాక్ తిన్నాడు. అందమైన అమ్మాయి పిక్చరుకెల్దాం రండని లాలించి ముద్దుగా పిలిస్తే పెళ్ళికాని యువకుడు నిర్లక్ష్యంగా పురుగుని తీసిపారేసినట్టు పారేస్తే రాధ షాక్ తిన్నది.

ఒట్టి వెధవ, స్టుపిడ్, కోరికల్లేని మనిషి ఏ బైరాగో అయి ఏ అడవులకో పోవడం మానేసి మన పీకలమీదకి ఆఫీసరయి పట్నంలో ఉండడమేమిటి, మనల్ని కాల్చుకు తినడానికి గాని అంటూ పిసుక్కు న్నాడు వెంకటప్పయ్య.

సరే పీడంతేదో తేలుస్తాను అంటూ లేచి నిల్చున్నాడు శేషయ్య.

వెంకటప్పయ్యా రాధాదేవీ ఆశ్చర్యంగా చూశారు. ఈ శేషయ్య శపథంలోని గూఢార్థ మేమిటో వాడి అంతు ఎలా తేలుస్తాడో అర్థం కాక నిర్ఘాంతపోయి చూస్తున్నారిద్దరూ.

"ఒరే వెంకటప్పయ్యా, నేనే స్వయంగా వెళతారా'' అన్నాడు శేషయ్య. యుద్ధంలో సేనలన్నీ సంహరించబడ్డాక రాజే స్వయంగా కత్తి పట్టుకుని యుద్ధానికి బయలుదేరినట్టుగా కండువా భుజంమీద వేసు కున్నాడు శేషయ్య.

"వెంకటప్పయ్యా, మన వర్తక సంఘం ప్రెసిడెంటు ఏడుకొండలకీ, వైసు ప్రెసిడెంటు సింహాచలానికి సెక్రటరీ రామతీర్థాలకీ నేను రమ్మంటు న్నానని కబురు చెయ్యి" అని ఆజ్ఞాపించి శేషయ్య తన అంతఃపురంలోకి నిష్క్రమించాడు.

రాధాదేవి తన చేతిలోని డిటెక్టివ్ నవల గిరవాటేసి వీధిలోకి బయలుదేరింది. తన హ్యాండుబ్యాగ్ తెరిచి చిన్న అద్దం చూసుకుంటూ పౌడరద్దుకుని, పెదవులూ కనుబొమ్మలు దిద్దుకొని వెంకటప్పయ్య వేపు చూసింది రాధాదేవి. సౌందర్యం చూస్తూ వెంకటప్పయ్యకు నోట మాట రాక మూర్ఛ వచ్చినంత పనయింది. మరుక్షణంలో చైతన్యం పొంది రాధ వేపు అదోలా చూశాడు రాధ ఒంటరిగా వుంటే అతనికి అదోలా చూడ్డం అలవాటు.

"టాటా" అంది రాధ.

"ఎక్కడికి?" అన్నాడు వెంకటప్పయ్య.

"పిక్చరుకి వస్తావా?"

నాకు వర్కుంది.

అయితే ఛావు అని చర్రున వీధిలోకి వెళ్ళి కారులో కూలబడి గెయిటీ అంది రాధాదేవి

రాత్రి ఒంటిగంట వరకూ చదివి ఆదివారం పొద్దున్న అలస్యంగా లేచాడు మూర్తి. ఆఫీసుకు సెలవు గబట్టి ఆలస్యంగా స్నానంచేసి కాఫీ టిఫిను తిని తన హోటలు గదిలో పుస్తకం చదువుతూ కూర్చు న్నాడు ఆఫీసు లేకపోవడంతో అతనికి రోజల్లా కాలక్షేపం కావడం కష్టం. ఈ దిక్కుమాలిన ఊళ్ళో మంచి లైబ్రరీ కూడాలేదు. ఉన్న ఒక్క లైబ్రరీలోనూ మంచి పుస్తకాలు లేవు. పుస్తకాల లిస్టు వ్రాసి స్తాను తప్పించండి అంటే ఫండ్సు లేవన్నారు లైబ్రరీ వాళ్ళు. ఈఊళ్ళో పుస్తకాల విలువ తెలిసిన వాళ్ళు మైనారిటీ చీట్లపేక విలువ తెలిసిన వాళ్ళదే మెజారిటీ. ఇక్కడి వాళ్ళకు బతుకు బోర్ కొట్టి పేకాటద్వారా బోర్‌డమ్ నుంచి బయట పడాలనుకుంటున్నారు.

మూర్తికి ఊళ్ళో ఇన్‌కమ్‌టాక్స్ కట్టే పెద్దలందరూ తెలుసు. రోజూ వాళ్ళతోనే తన పని. లైబ్రరీని పెద్దది చేస్తే బాగుంటుందని మాటవరసకి వాళ్ళతో అంటే చాలు, ఒక్కొక్కడూ వందలూ వేలూ విరాళమిస్తారు. కాని ఆ డబ్బు తనకు లంచమిస్తున్నట్లుగా యిస్తారు. నిజానికది లంచమే. ఎందుకంటే ఆ లైబ్రరీ వాళ్ళ కక్కరలేదు, తనకే కావాలి. అందుకే అలాంటి ప్రసక్తి తీసుకురాలేదు.

అసలీ పెద్దమనుషులంటే మూర్తికి పరమ అసహ్యం. వాళ్ళలో నిజాయితీ అనేది ఎక్కడా వెతికినా కనబడదు. నిజం చెప్పడం వాళ్ళకి

అలవాటు లేదు. అకారణంగా అబద్ధాలాడతారు. ఏమండీ కులాసాగా వున్నారా "అనడిగినా" ఆ ఏం కులాసాలెండి అంటారు. ''భోజనమయిందా అంటే'' ఆ ఏం భోజనం లెండి అంటారు గాని అయిందో లేదో చెప్పరు. మీ వాడు పరీక్ష పాసయేడట అంటే అదే మావాడు పాసయ్యేనంటు న్నాడు మరి అంటారు తమకేదో నమ్మకం లేనట్లు. వాళ్ళకి భార్యా బిడ్డలమీద ఎవరిమీదా నమ్మకం లేనట్లు, మాట్లాడుతారు. అసలు లోక మంతా దగాకోరులనే వాళ్ళ నమ్మకం. కాని ముఖప్రీతి మాటలు మాట్లాడుతారు వాళ్ళ స్వార్థానికి తోడ్పడితే మంచివాడంటారు, లేకపోతే దుర్మార్గుడంటారు. తాము బాగుపడ్డం కోసం లోకం నాశనమయినా ఫరవాలేదు. మళ్ళీ ఒకళ్ళని చూస్తే ఒకళ్ళకి కిట్టదు. ఒకరి గుట్టొకరు చెప్పేస్తారు. కాని అవసరమయినప్పుడంతా ఏకమవుతారు. అందుకనే వాళ్ళంటే మూర్తికి ఏవగింపు. ఇలాంటి వాళ్ళతో. ఏమాత్రం మంచిగా వున్నా మింగేస్తారు. లొంగితే హతమారుస్తారు. కాని ఉద్యోగరీత్యా వీళ్ళని తప్పించుకుని తిరగడం సాధ్యం కాదు, అందుకనే కనీసం తీరికవేళల్లో వాళ్ళతో సంబంధం పెట్టుకోకుండా పుస్తకాలు చదువు కుంటాడు.

తలుపు చప్పుడు కావడంతో మూర్తి ఆలోచనలు తెగిపోయాయి. లేచివెళ్ళి తలుపుతీశాడు.

శేషయ్యా ఏడుకొండలూ, సింహాచలం రామతీర్థాలు లోపలికి వచ్చారు. "రండి, దయచేయండి" అంటూ ఆహ్వానించాడు మూర్తి. "ఏమిటివాళ ఊళ్ళోని వణిక్ప్రముఖు లందరూ ఇలా దయచేశారు, రండి, ఉండండి, కుర్చీలు తెప్పిస్తాను."

"వద్దు బాబు అక్కర్లేదు. కుర్చీలెందుకూ, మేమేం పరాయి వాళ్ళమేమిటి? మనలో మనకి మర్యాదలేమిటి? ఇదిగో ఇలా మంచంమీద

కూర్చుంటాం. ఊరికే తమర్నొకసారి చూసిపోదామని వచ్చాం" అంటూ పెద్దలు మంచం మీద కూర్చున్నారు.

ఒక్కొక్కడు లక్షలమీద వ్యాపారం చేస్తున్న మిలియనీరు. యిలా తన హోటలు గదిలో తన మంచంమీద కూర్చున్నారంటే ఊరికే వచ్చి వుంటారని మూర్తి అనుకోలేదు. మూర్తికి వీళ్ళ సంగతి బాగా తెలుసు, మన అవసరంవాళ్ళకుంటే నేలమీదనైనా కూర్చుంటారు, లేక పోతే మొహమైనా చూడరు.

"ఏమిటిబాబూ యీ హోటలేటీ, యీ గదేటీ యీ మంచవేటీ ఏటి దంతా సెప్పండీ'' అంటూ సంభాషణ ప్రారంభించాడు ఏడుకొండలు.

"భోజనం మాత్రం యీ హోటలులో ఏంబావుంటుందనీ అంటూ వంతపలికేడు శేషయ్య.

మేమింత మందిమి బతికుండగా తమరు మా వూర్లో యిలా కష్ట పడుతూంటే సెబితే నమ్మరుగాని, మా తల కొట్టేసినట్టుంది బాబూ'' అన్నాడు సింహాచలం.

"ఏం, నాకేం కష్టంలేదే. ఈ హోటలు బాగానేవుందే'' అన్నాడు మూర్తి.

"ఏం బాగు బాబూ, మీ కభ్యంతరం లేకపోతే ఒక ఇల్లు చూసి పెడతాం. అద్దెకేలెండి, వంటమనిషిని కుదిరిస్తాం. హాయిగావుండొచ్చు" అన్నాడు శేషయ్య.

"అబ్బే వద్దు నాకిక్కడ బాగానే వుంది".

"తమరలా అంటే మేమేం చెప్పగలం. మీ కష్టాలు మా కళ్ళతో చూస్తున్నాంగదా, మేమంతా తమకి కావలసినోళ్ళమేగదా. మా దగ్గర

తమకి మొహమాటమేమిటి? మీకే సౌకర్యం కావాలన్నా కాకితో కబురు పెట్టండి-ఏర్పాటు చేస్తాం" అన్నాడు శేషయ్య.

"మీ సౌకర్యాలు చూడ్డం మా బాధ్యతగదా బాబూ ఆ బాబిలా హోటలుగదిలో నల్లుల మంచంమీద తొంగుంటే మీ అందరికీ సీమ కుట్టి నట్టయినా లేదేమ్రా లంజకొడుకుల్లారా అని ఊళ్ళో నలుగురూ మా మొగమ్మీద ఉమ్మేస్తున్నారు. అల్లకి జవాబు చెప్పుకోలేక చస్తున్నాం. మరి అళ్ళనేదీ కరక్టే అయినా మామంతా వుండగా తమకేటి లోవం సెప్పండి. యిల్లు కావాలా, వాకిలి కావాలా. కారుకావాలా, పనివాళ్ళు కావాలా, ఏం కావాలి సెప్పండి. సెబితేగాని మాకెలా తెలుస్తాది? తమరు సదువుకొన్నోరు మేం మూర్ఖులం. తమ మనసులో వున్నదేటో గ్రహించ డం మా తరంకాదు అంటూ ఏదో చెప్పుకు పోతున్నాడు రామతీర్థాలు.

ఈ సోదంతా మూర్తికి మహా తలనొప్పిగా వుంది. వీళ్ళందరిని చూస్తుంటే అతనికి చాలా అసహ్యమేసింది. ఈ స్వార్థపరులు చూపించే ఔదార్యం అతనికి జుగుప్సాకరంగా వుంది. వీళ్ళని వదిలించుకోవడ మెలాగో అర్థంకాలేదు వాళ్ళైనా బయటికెళ్ళాలి లేదా తనేనా పోవాలి. కాని వీళ్ళని బయటికి పొమ్మంటే మర్యాదగా వుండదు. తాను మాత్రం వీళ్ళని వదిలి ఎలా పోగలడు? ఆలోచిస్తూ టేబిలుమీదున్న బంతి తీసి నేలకేసి కొట్టి మళ్ళీ చేత్తో అందుకున్నాడు.

మూర్తి దేనికి జవాబివ్వక పోవడంతో వర్తకులుకూడా మాట్లా డడం ఆపేశారు. ఏం మాట్లాడాలో వాళ్ళకీ తోచలేదు. ఏదో ఒకటి మాట్లాడాలి కాబట్టి ఆ బంతి ఫారిన్‌దా బాబూ అన్నాడు శేషయ్య.

"ఇదా, అబ్బే, మన దేశందే, నిన్న బజారులో నడిచి వొస్తూంటే ఒక పేద కుర్రవాడు బంతులమ్ముతూ నా దగ్గరకొచ్చి ఒకటి కొనమని బ్రతిమాలేడు. సాయంత్రం వేళల్లో యిలా ఏవో వస్తువులమ్ముకుని

దానివల్ల వచ్చే డబ్బుతో చదువుకుంటున్నాడట. చదువుమీద వాడికున్న ఆసక్తిచూస్తే నాకు ఆశ్చర్యమేసింది. నా కవసరంలేక పోయినా ఈ బంతి కొన్నాను" అని బంతిని నేలకొడుతూ చేత్తో అందుకుంటూ ఆడుతున్నాడు మూర్తి.

వర్తకులకు ఏం మాట్లాడాలో తోచక నిశ్శబ్దంగా వున్నారు.

"పాపం ఆ కుర్రవాడికి నెలనెలా స్కూలు జీతం నేనే కడితే బాగుండు ననిపించింది. ఈ ఆలోచనవచ్చి వాడికోసం చూశాను. వాడు కనబడలేదు. జనంలో కలిసి ఎక్కడికో పోయాడు" అన్నాడు మూర్తి.

తనసంగతి తను చూసుకోవడం మానేసి ఎవరో బికారి కుర్ర వెధవ సంగతాలోచిస్తాడెందుకో వర్తకులకు అర్థం కాలేదు.

మూర్తి బంతితో ఆడుతునే ఉన్నాడు. కాని ఒకమారు బంతి చేతికందక ప్రక్కకి త్రుళ్ళి గుమ్మంలోంచి బయటికెళ్ళింది. దానికోసం మూర్తి కూడా గుమ్మందాటి వెళ్ళేడు. కాని ఆ బంతి అతనికి చిక్కకుండా జోరుగా మెట్లమీంచి దొర్లుకుంటూ పోయింది. మూర్తికూడా దానివెంట పరిగెత్తేడు. అది వెళ్ళి వెళ్ళి తిన్నగా వీధిలోకి పోయింది. మూర్తి కూడా వీధిలోకి పరుగెత్తి బంతిని పట్టుకున్నాడు.

వీధిలో అతనికి ప్రాణం లేచొచ్చినట్టయింది. హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు. వర్తకుల బెడద తప్పించుకోడానికి ఇంతకన్న మంచి అవకాశం లేదు. అక్కడే వున్న రిక్షా ఎక్కి తిన్నగా ఆఫీసుకెళ్ళి పోయాడు.

గదిలో కూర్చున్న వర్తకులు ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. ఎప్పటికీ మూర్తి గదిలోకి రాకపోవడంతో హోటలు కుర్ర వాణ్ణి పిలిచి మూర్తిని పిలవమన్నారు. ఆయన రిక్షా ఎక్కి వెళ్ళిపోయాడని వాడు చెప్పేడు.

వర్తకులు ఆశ్చర్యపోయారు. అందరినీ గదిలో వదిలిపెట్టి ఆఫీసు వెళ్ళిపోయాడా? వీళ్ళు లక్షలమీద వ్యాపారం చేస్తూ వేలకొద్దీ మనుషుల్ని చూస్తున్నారు. రకరకాల వాళ్ళతో లావాదేవీలు నడుపుతున్నారు. ఎంతెంత వాళ్ళనో సాధించుకొచ్చారు. కాని యిలాంటి మనిషినెక్కడా చూడలేదు.

మరి సందేహం లేదయ్యా. వీడికి కొద్దిగా మతి చెలించిన మాట నిజం. అన్నాడు శేషయ్య.

"సరే వదండి చూద్దాం" అంటూ మంచమీంచి లేచాడు ఏడుకొండలు.

మర్నాడు వర్తక సంఘసమావేశం జరిగింది. శేషయ్య, సింహాచలం, రామతీర్థాలు ఉపన్యాసాలిచ్చారు. బాబుల్లారా, మనమంతా ఓ కట్టుమీద నిలబడాల. నేకపోతే మనం కారు నవకయిపోతాం. ముష్టి వాళ్ళుకూడా మనల్ని బిచ్చమడగడం మానేస్తారు. వీళ్ళంతా సేతకాని లంజకొడుకులని కుక్కలు కూడా రాత్రుళ్ళు మనల్ని చూసి అరవడం మానేస్తాయి. ఇలాంటి ఆఫీసరుంటే మన అప్పీళ్ళన్నీ గోవింద. సర్కారోళ్ళు మన ముక్కు పిండి టాక్సులొసూలు చేస్తారు. అప్పుడు మనకేటి దారి. కాబట్టి యిప్పుడి సమావేశం తీర్మానం చేసి పై అధికారులకు పంపించాలి. దీనితోపాటు మంత్రిగారికి ఒక దరఖాస్తు కూడా పంపుతాము. దానిమీద అంతా సంతకాలు చెయ్యాల", అంటూ ఉపన్యసించేడు వర్తక సంఘం ప్రెసిడెంటు ఏడుకొండలు.

కొత్తగా వచ్చిన ఇన్‌కమ్‌టాక్సు ఆఫీసరు మూర్తికి కొద్దిగా మతి చెలించిందనీ, చాలా విచిత్రంగా ప్రవర్తిస్తున్నాడనీ ఇలాంటి ఆఫీసరుతో వ్యవహరించడం తమకు కష్టమనీ, కాబట్టి వెంటనే ఆయన్ను బదిలీ చెయ్యాలనీ సభవారు తీర్మానం చేసి దానిని దరఖాస్తుతో బాటు పై అధికారులకూ, మంత్రిగారికీ పంపించారు